క్లుప్తంగా

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొట్టిన కారు

సీతంపేట: స్థానిక దోనుబాయి జంక్షన్ వద్ద ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వచ్చిన కారు బలంగా మంగళవారం ఢీకొట్టింది. అదృష్టవశాత్తు ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. ఎటువంటి గాయాలు ఎవరికీ తగలకపోవడంతో ప్రమాదం త్రుటిలో తప్పింది. కారు ముందుభాగం నుజ్జయింది. బస్సు వెనుకభాగం కొంత పాడైంది.

ఐటీఐలో ప్రవేశాలకు 27న కౌన్సెలింగ్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 27న ఉదయం 10 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు. ఐటీఐలోని విద్యార్థులకు 'ఉన్నతి' సౌజన్యంతో సెప్టెంబర్ నుంచి ఇంగ్లిష్ మీడియంలో సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

పార్వతీపురంటౌన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. పురపాలక సంఘం పరిధిలో మంగళవారం పారిశుద్ధ్య పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 5,6,15,16,23,24 వార్డుల్లో, మున్సిపల్ ఆఫీస్ వెనుకవైపు, జగన్నాథపురం, కొత్తవలస, బెలగాం వాటర్ ట్యాంకు చుట్టుపక్కల ప్రదేశాలలో పారిశుద్ధ్య పనులు చేయించినట్లు చెప్పారు. అనంతరం స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఈ కిరణ్, హెల్త్ అసిస్టెంట్ రామారావు, శానిటేషన్ సెక్రటరీ అచ్యుత్, తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం



రేపటివలసలో నాటిన మొక్కలను పరిశీలిస్తున్న ఏపీఓ భాను

సీతానగరం: ఉపాధిహామీ జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించడంతో పాటు ఉద్యానపంటల సాగును ప్రోత్సహించేలా ప్రణాళికలు రూపొందించినట్లు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ భాను తెలిపారు. మండలంలోని గుచ్చిమి, రేపటివలస, తామరఖండి, టి.సీతారాంపురం గ్రామాల్లో ఉపాధిహామీ పథకం నిధులతో నాటిన జీడిమామిడి, మామిడి మొక్కలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండ్ల తోటలు, ఉద్యాన, వాణిజ్య పంటల సాగుచేసేందుకు రైతులకు ఉపాధిహామీ పథకం ద్వారా ఆర్థిక ప్రోత్సాహం అందిస్తున్నట్లు చెప్పారు. మొక్కలు అందించడంతో పాటు వేతనదారులతో ప్లాంటేషన్ పనులు చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం మండలంలో 5 ఎకరాల్లో వివిధ రకాల పండ్ల మొక్కలు వేశామని, మరో 15 ఎకరాల విస్తీర్ణంలో పిట్‌లు తీయడం జరిగిందన్నారు. పండ్ల తోటల పెంపకం, ఎరువుల వినియోగం, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టెక్నికల్, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

శాకంబరీదేవిగా పోలమాంబ



మక్కువ: మండలంలోని శంబరలో కొలువైన శంబర పోలమాంబ అమ్మవారు మంగళవారం శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ వి.వి.సూర్యనారాయణ పర్యవేక్షణలో చదురుగుడి, వనంగుడిలో కొలువైన పోలమాంబ, పెదపోలమాంబ అమ్మవార్లకు అర్చకులు కూరగాయలు, పండ్లతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మార్కొండపుట్టి గ్రామంలో ఎద్దుపోలమ్మ అమ్మవారు శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన నాక్ బృందం

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నాక్ బృందం సభ్యులు మంగళవారం సందర్శించారు. బృందానికి పీర్ టీమ్, ఆర్‌జేడీ శోభారాణి, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబుతో పాటు అధ్యాపకులు, పూర్వపు, ప్రస్తుత విద్యార్థులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కళాశాల పరిపాలన అంశాలను, కళాశాల ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు విద్యార్థులు సాధించిన విజయాలను బృందం సభ్యులకు క్షుణ్ణంగా వివరించారు. కళాశాలలో వివిధ విభాగాలైన క్యాంటీన్, గ్రంథాలయం, బాలికల విశ్రాంతి గృహం, మెడిసినల్ ప్లాంట్లను బృంద సభ్యులు సందర్శించారు. వాటికి సంబంధించిన వివరాలను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. వివరాల పట్ల బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటు పూర్వపు విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం చేపట్టారు. కళాశాల అభివృద్ధి, అవసరాలపై వారి నుంచి సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాల అవసరాలను వారి దృష్టికి తీసుకువెళ్లారు. కళాశాల ఉన్నతంగా అభివృద్ధి చెందేందుకు నాక్ బృందం సభ్యులు సహకరించాలని విద్యార్థులు కోరారు. తద్వారా తమ చదువుల ఉన్నతికి సహకరించాలని కోరారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వసతులను పరిశీలిస్తున్న నాక్ బృందం సభ్యులు, ఆర్‌జేడీ శోభారాణి

పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు చర్యలు

● జేసీ శోభిక

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన మట్టికట్టను ఆనుకుని ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తోటపల్లి ప్రాజెక్టుకు భూ సేకరణ జరిగిందని, అందులో కొంత ప్రాంతం ఖాళీగా ఉందన్నారు. కుడి మట్టికట్టకు ఆనుకుని బోటు షికారు, ఐటీడీఏ పార్క్‌ను ఇప్పటికే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈప్రాంతంలో ఏవియేషన్ హబ్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేయనున్నట్లు చెప్పారు. ఈ హబ్ సుమారు రెండెకరాల ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేసి, పూర్తిస్థాయిలో ప్రణాళికలు తయారు చేయాలని స్థానిక తహసీల్దార్ కె.జయను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. తదుపరి చర్యల నిమిత్తం నివేదికను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు వివరించారు. పరిశీలనలో ఆర్డీఓ కె.హేమలత, మండల సర్వేయర్ బి.శ్రీనివాసరావు, ఆర్ఐ ఎం. కృష్ణతో పాటు పలువురు అధికారులు ఉన్నారు.



ఏవియేషన్ హబ్‌కు స్థల పరిశీలన చేస్తున్న జేసీ శోభిక

పంటల పరిశీలన

కురుపాం:

రైతులు వ్యవసాయశాఖ సిబ్బంది సూచనలు, సలహాలు పాటించడం ద్వారా సాగులో అధిక దిగుబడులు పొందవచ్చని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.ఎస్.ధృవ సూచించారు. నియోజకవర్గంలోని కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో సాగులో ఉన్న వరి, అరటి పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీటమునిగిన వరి పొలాలు పరిశీలించి రైతులకు సస్యరక్షణపై పలు సూచనలు చేశారు. పొలం నుంచి నీటిని తొలగించాలని, అనంతరం ఐదు సెంట్లలో వేసిన నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో ఎంఓపీ వేసుకోవాలని సూచించారు. అరటి పంటలో సిగాటోక ఆకు మచ్చలు గుర్తించినట్లయితే ప్రోపికోనోజెల్ మందును పిచికారీ చేయాలన్నారు. ఆయన వెంట కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు ఉన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్, శాస్త్రవేత్తలు

వీఆర్‌ఓలు ప్రజలకు అందుబాటులో ఉండాలి

వీరఘట్టం: మండలంలోని అన్ని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న వీఆర్‌ఓలు ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ కె.జయప్రకాష్ సూచించారు. వీఆర్‌ఓలతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున నదీతీర ప్రాంతాల్లోని వారు నదిలోకి వెళ్లనీయకుండా దండోరాలు వేయించాలని సూచించారు. అలాగే ఎక్కడైనా ఎటువంటి ప్రమాదం సంభవిస్తే వెంటనే తెలియజేయాలని తెలిపారు. విద్యార్థులకు కావాల్సిన కుల, ఆదాయ, ఇతర ధ్రువపత్రాలను సకాలంలో మంజూరు చేసేలా సచివాలయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో డీటీ కుమారస్వామి, ఆర్ఐ లక్ష్మునాయుడు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.



వీఆర్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జయప్రకాష్

రక్షణ గోడ నిర్మాణానికి ప్రతిపాదనలు

వీరఘట్టం: వీరఘట్టం – పాలకొండ సీఎస్‌పీ రహదారిలో ప్రమాదకరంగా ఉన్న చిదిమి జంక్షన్ మలుపును మంగళవారం పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు మంగళవారం పరిశీలించారు. ఇటీవల ఇక్కడ ఓ ఎరువుల లారీ డివైడర్‌ను ఢీకొట్టడంతో కూలిపోయిన రక్షణగోడను పరిశీలించారు. ఇక్కడ కల్వర్టుపై వెంటనే రక్షణగోడ నిర్మించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రక్షణగోడ నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి ప్రతిపాదనలు చేసారు. ఈ జంక్షన్‌కు ఇరువైపుల హెచ్చరిక బోర్డులను అమర్చాలని ఎస్ఐ షేక్ ఫక్రుద్దీన్‌ను ఆదేశించారు. పోలీసు సిబ్బంది కూడా ఇక్కడ పహారా నిర్వహించాలని సూచించారు. వాహనదారులు కూడా పరిమితి వేగంతో ప్రయాణాలు చేయాలని ఈ రోడ్డులో ఉన్న ప్రమాదకర మలుపులు వద్ద అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు.



చిదిమి జంక్షన్ వద్ద ప్రమాదకర మలుపును పరిశీలిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

పారిశుద్ధ్య పనుల పరిశీలన

పాలకొండ: పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. మండలంలోని కొండాపురం గ్రామంలో పారిశుద్ధ్య పనును ఆయన మంగళవారం పరిశీలించారు. గ్రామంలో పలు వీధుల్లో పారిశుద్ధ్యం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పడేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సచివాలయ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని కార్యదర్శి పవన్‌కుమార్‌కు ఆదేశించారు. వచ్చే నెల 2వ తేదీ వరకు పారిశుద్ధ్య పక్షోత్సవాలు పక్కాగా నిర్వహించాలని తెలిపారు.



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

మెరుగైన బోధన అందించాలి

పాలకొండ రూరల్: విద్యా వారం కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు మరింత మెరుగైన తోడ్పాటును విద్యార్థులకు అందించాలని ఎంఈఓ కురిటి సోంబాబు అన్నారు. మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతన్న విద్యా సప్తాహ్ కార్యక్రమాలను మంగళవారం ఎంఈఓ స్వయంగా పరిశీలించారు. జాతీయ విద్యావిధానం(ఎన్ఈపీ) అమల్లోకి వచ్చి నాలుగేళ్లు పూర్తి కావస్తున్న క్రమంలో సర్వశిక్ష సూచనల మేరకు విద్యార్థులచే ప్రాజెక్టులు చేయించి వారిలో దాగి ఉన్న అంతర్గత నైపుణ్యాలను వెలికి తీయాలన్నారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులను అన్ని సబ్జెక్టుల్లో ప్రోత్సహించాలన్నారు.



స్థానిక ఎంపీపీ పాఠశాలలో సప్తాహ్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

'తల్లికి వందనం' ఎప్పుడిస్తారు?

గుమ్మలక్ష్మీపురం: తల్లికి వందనం పేరుతో కుటుంబంలో ఎంత మంది పిల్లలు బడికి వెళ్తే అంతమందికి సంవత్సరానికి రూ.15 వేలు ఇస్తామన్నారు. ఎప్పుడిస్తారని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వంలో విద్యా సంవత్సరం ప్రారంభంలోనే తల్లుల ఖాతాల్లో అమ్మఒడి నిధులు జమ అయ్యేవని, పిల్లల చదువులకు ఈ నిధులు ఎంతగానో ఉపయోగపడేవని అన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనంకు సంబంధించి ఇంతవరకు విధివిధానాలను ప్రకటించకపోవడంతో పిల్లల చదువులపై తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం తల్లికి వందనంను ఆగష్టు 15లోగా పేదలందరికీ అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి

కొమరాడ: కొమరాడ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను ఎస్సై నీలకంఠంను అడిగి తెలుసుకున్నారు. సరిహద్దు ప్రాంతం కావడంతో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

కురుపాం: స్థానిక పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతనంగా ప్రారంభించిన పోలీస్ స్టేషన్ భవనాలను పరిశీలించారు. ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, ఎస్సై షణ్ముఖరావు స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిస్థితిని ఎస్పీకి వివరించారు.

రోడ్డుపై వరినాట్లు



గుమడ వద్ద రహదారి గోతుల్లో నాట్లు వేస్తున్న సీపీఎం నాయకులు

కొమరాడ: పార్వతీపురం నుంచి కూనేరు వెళ్లే అంతర్ రాష్ట్ర రహదారి గోతులతో నిండిపోయి అధ్వానంగా తయారైంది. ప్రభుత్వం వెంటనే స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుదరతో నిండిన రోడ్డుపై మంగళవారం వరినాట్లు వేసి నిరసన తెలియజేశారు. ఈ రోడ్డులో కనీసం మోటార్ సైకిల్ కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని, వాహనాలు గోతుల్లో దిగబడిపోతుండడంతో ప్రయాణికులు తరచూ నరకం చూస్తున్నారని వాపోయారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారి గోతులు పూడ్చాలని కోరారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్నప్రత్యేకాధికారి రాధాకృష్ణ

పార్వతీపురంటౌన్: ప్రభుత్వ పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ప్రత్యేకాధికారి రాధాకృష్ణ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయులతో సమావేశమై పాఠశాలలో అందుబాటులో ఉన్న వసతులు, బోధనకు సంబంధించిన పలు అంశాలపై ఆరాతీశారు. 8,9,10వ తరగతుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం ఎం.శశిధర్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

కురుపాం: వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ షణ్ముఖరావు అన్నారు. కురుపాం మండల కేంద్రంలోని శోభలతాదేవి కాలనీ జంక్షన్ వద్ద మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. వాహన ధ్రువపత్రాలు, లైసెన్స్, హెల్మెట్ లేకుండా ప్రయాణించేవారిపై అపరాధ రుసుం విధించారు. రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. నిబంధనలు కచ్చితంగా పాటించాలని, అతిక్రమించేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో ఏఎస్ఐ దొర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వాహన ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న ఎస్ఐ షణ్ముఖరావు

లైంగిక వేధింపులను ధైర్యంగా ఎదుర్కోవాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు సిబ్బంది

కురుపాం: చట్టాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులను మహిళలు ధైర్యంగా ఎదుర్కోవచ్చని ఐసీడీఎస్ పీఓ కె.విజయగౌరి అన్నారు. కురుపాం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పని ప్రదేశాల్లో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, వాటిని నివారించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లోని మహిళలు, బాలికలకు దీనిపై మరింత అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

గరుగుబిల్లి: సీజనల్ వ్యాధులు ప్రబల కుండా అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి ఒ.ప్రభాకరరావు అన్నారు. మండలంలోని తోటపల్లిలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. జలజీవన్ మిషన్‌ను సక్రమంగా అమలు చేయాలని, ఇంటింటికీ కుళాయిల ద్వారా సురక్షిత తాగునీరు అందించాలని సూచించారు. తాగునీటి పైపులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, లీకుల ద్వారా నీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. కాలువలను శుభ్రం చేయడంతో పాటు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.

బహిరంగ మలవిసర్జనను నిర్మూలించాలని, ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించేలా అవగాహన కల్పించాలన్నారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ పి.సూర్యనారాయణ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆవాల సింహాచలమమ్మ, నాయకులు కన్నయ్య, ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

గరుగుబిల్లి: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు అన్నారు. మండలంలోని గిజబ గ్రామంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను మంగళవారం పరిశీలించారు. కాలువల్లో పూడికలు తొలగించడం, తాగునీటి వనరుల క్లోరినేషన్, తదితర పనులు చేపట్టారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కలిస్తూ ర్యాలీ నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎం.భాగ్యలక్ష్మి, నాయుకులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఈఓపీఆర్డీ గోపాలరావు, తదితరులు

పాలవలసలో వైద్య శిబిరం

భామిని: జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి కె.దామోదరరావు అన్నారు. మండలంలోని పాలవలస గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించారు. జ్వర పీడితుల నుంచి రక్తపూతలు సేకరించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

దోమల నివారణా మందు పిచికారీ

భామిని: కారిగూడ, పోలవరం గ్రామాల్లో ఏసీఎం 5 శాతం దోమల నివారణా మందును సబ్‌యూనిట్ అధికారి పి.అప్పారావు ఆధ్వర్యంలో మంగళవారం స్ప్రేయింగ్ చేశారు. కార్యక్రమంలో మండల ఈఓపీఆర్‌డీ కృష్ణారావు, హెల్త్ అసిస్టెంట్ లక్కాయి, ఏఎన్ఎం భారతి పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలను కురుపాంలోనే కొనసాగించాలి

కురుపాం: కురుపాంలోనే ఏకలవ్య పాఠశాలను కొనసాగించాలని గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు, నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ కురుపాంలో మంజూరైన ఏకలవ్య పాఠశాలను ప్రస్తుతం పార్వతీపురంలో కొనసాగిస్తున్నారని, ప్రస్తుతం కురుపాంలో నూతన భవనాల నిర్మించినా ఇంకా పార్వతీపురంలో కొనసాగించడం సరికాదన్నారు. గత ప్రభుత్వం ఏకలవ్య పాఠశాల కోసం కురుపాం మండల కేంద్రంలోని శివ్వన్నపేట వద్ద నూతన భవనాలు నిర్మించిందన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ఉపాధ్యాయులను నియమించడం వల్ల గిరిజన విద్యార్థులు భాషాపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. స్థానికంగా అర్హత కలిగిన వారిని ఉపాధ్యాయులుగా నియమించాలని కోరారు. వారితో పాటు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ తోయక ప్రకాశరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పి.నరేష్, జి.గంగరాజు, పి.రాజు, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

ఆశ్రమ పాఠశాల సందర్శన

సీతంపేట: చిన్నబగ్గ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను డిప్యూటీఈఓ పాలక నారాయుడు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల చదువులు పరిశీలించారు. ఉపాధ్యాయుల లెసన్‌ప్లాన్‌లు, టీచింగ్ డైరీలు, విద్యార్థుల నోటుపుస్తకాలు పరిశీలించారు. ఎపిడమిక్ సీజన్ కాబట్టి విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, మెనూ పక్కాగా అమలు చేయాలన్నారు.



విద్యార్థుల చదువులను పరిశీలిస్తున్న డిప్యూటీఈఓ నారాయుడు

